




# కరపత్రం

SINCE 2014

బుధవారం మార్చి 25, 2026 | సంపుటి : 2 | సంచిక : 163 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బిఆర్ఎస్

### ఏం తప్పు చేశామని అంతలా విమర్శలు



- విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడం తప్పా
- మహిళలను కోటీశ్రులను చేయాలనుకోవడం తప్పా
- బీమా పథకంలో ఆదుకోవాలనుకోవడం సరికాదా
- బడ్జెట్ ప్రతులు చించి ఎందుకు పారిపోయారు
- గతంలో అసెంబ్లీలో మాట్లాడే పరిస్థితి ఉండేదా
- బడ్జెట్‌పై చర్చకు సమాధానంలో బిఆర్ఎస్‌పై భట్టి చురకలు

**హైదరాబాద్,మార్చి24 :**
బడ్జెట్‌లో మేం ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వడాన్ని కూడా ఓర్వలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించడం నేరమా అని నిలదీశారు. కుటుంబంలో పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబ పరిస్థితి తలకిందులైపోతుంది. అలాంటి కుటుంబాలకు ఆర్థిక సమస్యలు ఉండకూడదని బీమా కల్పించాం. సంక్షేమ పథకాల గురించి చెబుతుంటే.. వినడానికి బీఆర్ఎస్‌కు సమయం లేదా? క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కావాలని ఉద్యోగులు పదేళ్ల నుంచి అడుగుతూనే ఉన్నారు. గతంలో వారు మాట్లాడేందుకు కూడా భయపడే పరిస్థితి కల్పించారు. గతంలో నేను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదు. డిప్యూటీ సీఎం హోదాలో బడ్జెట్ ప్రవేశ పెడితే.. బడ్జెట్ పత్రాలు చించి సభ నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ సభ్యులు చెప్పిందే మేం వినాలి.. వినకపోతే మేం వెళ్లిపోతామంటున్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడకండి అంటూ భట్టి చురకలంటించారు. రైతు భరోసా పథకాన్ని బీఆర్ఎస్ ఎన్నికల స్కీమ్‌గా మార్చుకుంది. 2018లో ప్రజలు ఓట్లేసేందుకు క్యూలైన్‌లో ఉండగా.. రైతు భరోసా నిధులు జమచేశారు. మేం ఎప్పుడూ ఎన్నికల కోసం రైతు భరోసా నిధులు జమచేయలేదు. రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం. రైతులకు ఉచిత కరెంట్ పథకం పేటెంట్ హక్కు మాదే. వ్యవసాయాన్ని పండగలా చేసిందే కాంగ్రెస్. మా ప్రభుత్వం రాగానే రైతులకు ఒకేసారి రుణమాఫీ చేసింది. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదన్నదే బీఆర్ఎస్ ఆలోచన అంటూ దుయ్యబట్టారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే మా లక్ష్యం అని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో భట్టి విక్రమార్క ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలను, ఉద్యోగులను నిర్బంధించిన వారు.. ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బ్జడెట్‌ను వినే ఓపిక లేక సభ నుంచి వెళ్ళిపోవడం వారి అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న నాకు జరిగిన అవమానాలు రికార్డుల్లో స్పష్టంగా ఉన్నాయి. ప్రజల సమస్యల కోసం మైక్ అడిగితే ఇవ్వని వారు, నేడు మేము ప్రతి అంశానికి సమాధానం ఇస్తామన్నా వినకుండా పారిపోతున్నారని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

2లో..



2లో..

## ఢిల్లీ అసెంబ్లీ స్పకర్‌కు బెదిరింపు మెయిల్

- మోడీ,అమిత్ షా,జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక
- ఢిల్లీ మెట్రో, అసెంబ్లీ లకు బాంబు బెదిరింపులు

**న్యూఢిల్లీ,మార్చి24 :**
దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు.

### ఇవి వాహనాలపై

## 20శాతం డిస్కౌంట్

- పెద్ద ఎత్తున ఇవి ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు
- ముందుకు వచ్చిన మహింద్రా తదితర కంపెనీలు
- రవాణామంత్రిపొన్నంప్రభాకర్



**హైదరాబాద్,మార్చి24:**
హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరు ఢిల్లీ లాగ హైదరాబాద్ కాలుష్యం కావద్దని ఉద్దేశ్యంతో ఈవీ పాలసీ తీసుకొచ్చిందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఈవి పాలసీ తీసుకొచ్చింది..ఈవీ పాలసీ తో జీరో రోడ్ టాక్స్ ,జీరో రిజిస్ట్రేషన్ టాక్స్ మినహాయింపు ఉంటుంది.. దాని ద్వారా దాదాపు వెయ్యి కోట్లు ప్రభుత్వం నష్టపోయిన ఈవీ పాలసీ నీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది..



2లో..

## జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

- పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్
- నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి
- తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన
- నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు

**జగిత్యాల,మార్చి24**
తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా.. పార్టీ అధికారంలోకి వచ్చినందుకు సంతోషపడ్డానన్నారు. మంగళవారం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో తనది పూలబాట కాదని.. ముళ్ల బాట అని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ కాబట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి,



## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

- వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది
- దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

## గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి

### అసెంబ్లీ గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ ఆందోళన

**హైదరాబాద్,మార్చి24 :**
రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. అవే ప్లకార్డులతో అసెంబ్లీకి బయల్దేరి వెళ్లారు. గ్యాస్ కొరత లేదని చెబుతూనే హోటళ్లు, చిరు వ్యాపారులకు వాణిజ్య సిలిండర్ల సరఫరాను నిలిపివేయడంపై బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.



2లో..

## ‘దక్షిణాదికి ఎక్కడ అన్యాయం జరగదు’

**హైదరాబాద్:**
డిలిమిటేషన్‌లో మహిళా రిజర్వేషన్ అనేది 33 శాతంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. జనగణన అనంతరం డిలిమిటేషన్ జరుగుతుందన్నారు. జనాభా , ప్రాంతాల ఆధారంగా పునర్విభజన జరగదని, ఒకవేళ అలా జరిగితే నార్త్ ఈస్టర్న్ రాష్ట్రాల సీట్లు పెరగవన్నారు రాంచందర్‌రావు. ‘ఇక్కడ 8 వేలు ,10 వేలు జనాభా ఉన్న సీట్లు ఉన్నాయి.



2లో..



## నాకు మంత్రి పదవి ఇస్తే.. కాంగ్రెస్‌కే మంచి పేరు

### -కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**హైదరాబాద్:**
మంత్రి పదవి కోసం తాను పరితపించడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంత్రి పదవి ఇస్తామని గతంలో అధిష్ఠానం హామీ ఇచ్చిందని, దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తనకు తెలియదని చెప్పారు.

### క్షయవ్యాధిపట్ల

## ప్రజలు అప్రమత్తం అవసరం

- వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స తీసుకోండి
- ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోంది
- నాపా ప్రతినిధుల అవేర్‌నెస్ కార్యక్రమం అభినందనీయం
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్,మార్చి24 :**
క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఇది సమాజానికి పట్టిన చీడ అన్నారు. కేం÷-దర రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధి న ఇవారణకు అనేక చర్యలు తీసుకుంటున్నా..మళ్లీ ఇది విజృంభించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. క్షయ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోందని అన్నారు. అంతర్జాతీయ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి మాట్లాడారు.

2లో..

# గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి

మొదటి పేజీ తరువాయి

గ్యాస్ కొరత కారణంగా సాధారణ ప్రజానీకంతో పాటు చిరు వ్యాపారులు, హోటల్ వ్యాపారంపై ఆధారపడిన లక్షలాది మంది ఉపాధికి తీవ్ర విఘాతం కలిగిందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సరఫరా సంక్షోభంపై ప్రజలకు నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. యుద్ధం ప్రారంభమయ్యాక ఎల్‌పీజీ సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద చాంతాడంత లైన్లు కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. గ్యాస్ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు నమ్మబలుకు తోందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని చెప్పారు.

రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రం ఆధీనంలో పెట్రోలియం శాఖ ఉందని.. తామేమీ చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం అంటోందని కేటీఆర్ అన్నారు. ఫ్యూచర్‌లో గ్యాస్ సిలిండర్ల సైజ్ తగ్గిస్తారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయిని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంబోతుల కొట్లాటలో లేగలు బలైనట్లుగా సామాన్యుల పరిస్థితి ఉందని అన్నారు. యుద్ధం కారణంగా గ్యాస్ కొరత చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. కొరత లేదని కేంద్రం, సప్లయి లేదని రాష్ట్రం ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ఇవి వాహనాలపై 20శాతం డిస్కౌంట్

మొదటి పేజీ తరువాయి

ఈవి పాలసీ వచ్చిన తర్వాత ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం భారీగా పెరిగింది.. అందువల్ల ఇటీవల రవాణా శాఖ సమీక్షా సమావేశం లో ప్రభుత్వం ఉద్యోగులకు ప్రోత్సాహం ఇవ్వాలని తయారీ దారులను కోరడం జరిగింది.ప్రభుత్వ సంస్థలకు , హైర్ లేదా డిపా÷-టం÷-మెంట్ లు కొనుగోలు చేస్తే ఈవీ వాహనాలు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు..ఈవి వాహనాలకు అన్ని ప్రాంతాల్లో ఈవి ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది..కంపెనీ దారులు ప్రభుత్వ ఉద్యోగులకు 10-20 శాతం వారు డిస్కౌంట్ ఇస్తారు.. మహేంద్ర ఎలెక్ట్రిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్,ఓలా తో పాలు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయి..క్యూర్ ఏరియా లో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి.. క్యూర్ ఏరియా లో డీజిల్ ఆటో లు కూడా రిట్రైరోఫిట్ గా మార్చి నడపాలని నిర్ణయం తీసుకుంది.. రెడ్కో ద్వారా కూడా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది.. ఆర్థిక మంత్రికి శాసన మండలి లో చెప్పడం జరిగింది.. ప్రజా ప్రతినిధులు ఈవి వాహనాలకు లోన్ తీసుకునేలా చెప్పడం జరిగింది.. ముందుగా ఉద్యోగులకు ప్రథమ పౌరుడు సిఎస్ ,ఉద్యోగ సంఘాల నాయకులు ఈవీ వాహనాన్ని బుక్ చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు.15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాపేజీ కి పంపిస్తున్నాం.. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నాం.. తెలంగాణ లో నిన్న వాహన్ పోర్టల్ లోకి చేరాం.. వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు షో రూమ్ లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలంటే ఉద్యోగులే వారధిగా ఉంటారని అన్నారు.

# 'దక్షిణాదికి ఎక్కడ అన్యాయం జరగదు'

మొదటి పేజీ తరువాయి

జనాభా ఆధారంగా సీట్ల పెంపుదల ఉంటుందని కాంగ్రెస్ చేసే ఆరోపణలో నిజం లేదు. అసెంబ్లీ సీట్ల సంఖ్య ఆధారంగా లోక్ సభ సీట్లు పెరిగే అవకాశం ఉంది. దక్షిణాదికి ఎక్కడ అన్యాయం జరగదు. ఉత్తరాదికి పెరిగిన ప్రపోషన్ ఆధారంగా దక్షిణాదిన సీట్లు పెరుగుతాయి. ఎస్సీ, ఎస్టీ లు మతం మార్పిడి చేస్తే రిజర్వేషన్ వర్తించదనే కేసులో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం.

ప్రలోభాలకు గురి చేసి మతం మార్చుకుంటున్నారు. మత మార్పిడిల వల్ల ఎస్సీ, ఎస్టీ లకు అన్యాయం జరుగుతుంది. ఈ జడ్జిమెంట్ తో ఎస్సీ ఎస్టీ లకు అందాల్సిన సరైన ఫలాలు అందుతాయి' అన్నారు.

## నాకు మంత్రి పదవి ఇస్తే.. కాంగ్రెస్‌కే మంచి పేరు

మొదటి పేజీ తరువాయి

మంగళవారం అసెంబ్లీ ఆవరణలో మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు."నాకు మంత్రి పదవిస్తే.. కాంగ్రెస్‌కు, ప్రభుత్వానికి మంచి పేరొస్తుంది. ఏ పదవి లేకున్నా.. నాకు ప్రజల్లో తగిన గౌరవం ఉంటుంది. కాంగ్రెస్‌కు మళ్లీ అధికారం రావాలంటే.. నాలాంటి ఉద్యమకారుల సేవలు అవసరం. సీఎం రేవంత్‌రెడ్డితో నాకెలాంటి ఇబ్బంది లేదు. నిన్న ముఖ్యమంత్రితో ప్రత్యేక భేటీ ఏం లేదు.. ఎదురుపడితే పలకరించుకున్నాం. ఇవాళ కేటీఆర్‌తోనూ సాధారణ అంశాలపైనే మాట్లాడా. 2018లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం తప్పని కేటీఆర్‌కు చెప్పా" అని రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

# దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి

దాదాపు ఆరున్నర, 7 లక్షల మంది దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ చాలా వాగ్దానాలు ఇచ్చింది. 100 రోజుల్లోనే 6 వేల పెన్షన్ అని చెప్పింది. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చింది. బ్యాక్ లాగ్ పోస్టుల విషయంలో, చదువుల విషయంలో కానీ చాలా చాలా వాగ్దానాలు వారి అభయహస్తం మేనిఫెస్టోలో చాలా వివరంగా ఇచ్చారు. అవన్నీ కూడా మా సోదరుల దగ్గర చాలా వివరంగా వారి ఫోన్లలో, వారి మనసుల్లో ముద్రించుకొని పోయి ఉన్నయి. తెల్లారి లేస్తే శారీరకంగా అవస్థలు పడే దివ్యాంగులు కోరుతున్నది ప్రత్యేకంగా కొత్తగా ఏం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ పార్టీగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వారు ఇవాళ అసెంబ్లీలోకి రావాలని ప్రయత్నం చేశారు. నేనడిగాను అసెంబ్లీలో లోపలికి రానీయండి.. మా లెసిస్లేచర్ పార్టీ ఆఫీస్‌లో కలుద్దాం. వారు బయట రోడ్డు మీద కలవటం కరెక్టు కాదు. కానీ వీళ్లంతా వస్తే మాకేదో ఇబ్బంది అయితది. వాళ్లను వద్దు అని చెప్పి పాసులు కూడా ఇయ్యకుండా సతాయిస్తే వారిని నడిరోడ్డుమీద కలవాల్సిన దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ మండిపడ్డారు. దివ్యాంగుల గురించి కళ్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు పొంది గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని మేం ఈ బడ్జెట్ సెషన్‌లో అడుగుతాం.. నిలదీస్తాం. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదు. పక్క రాష్ట్రంలో రూ.6 వేల పెన్షన్ ఇస్తున్నరు. మీరు గద్దెనెక్కిన తర్వాత మూడో బడ్జెట్ ఇది 60 శాతం సమయం అయిపోయిన తర్వాత కూడా ఎందుకు ఇంకా డబ్బులు కేటాయించడం లేదు. నిలదీస్తాం. దీంతోపాటు దివ్యాంగులకు గతంలో మేం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇచ్చి ఆదుకునే ప్రయత్నం చేసినం. ప్రతీ దాంట్లో కోటా పెట్టి వారిని ఆదుకునే ప్రయత్నం చేశాం. భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ చేస్తాం. కానీ ఈ ప్రభుత్వం దివ్యాంగ సోదరసోదరీమణులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు. నేడు ఇందిరాపార్క్ దగ్గర వాళ్లు రిలే నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు దానికి కూడా మా మద్దతు ఉంటుంది. పార్టీ నాయకులం కూడా హాజరవుతాం. తప్పకుండా దాన్ని కూడా విజయవంతం చేయాల్సిందిగా దివ్యాంగ సోదరులను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

మొదటి పేజీ తరువాయి

సీఎల్పీ లీడర్ కాబట్టి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. కానీ తాను శాసన మండలిలో నేతను అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేశారు. మరి తనకెందుకు అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల్లో మనకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శం కాదు కదా? అంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన చరకలంటించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏమిటి? మనం చేస్తున్నదేమిటంటూ రాష్ట్రంలోని పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా నిలదీశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వంటి నేతలు ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకంటూ జీవన్ రెడ్డి ఈ సందర్భంగా కొంత అసహనం వ్యక్తం చేశారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని చెప్పారు. తాను పార్టీ వీడి వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారంటూ కాంగ్రెస్ ప్రతినిధుల రాకపై జీవన్ రెడ్డి స్పందించారు.కాంగ్రెస్ పార్టీని వీడొద్దని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర, 43 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి. ఆయన మాకు తండ్రిలాంటివారు. రాజకీయాల్లో ఆయన సీనియర్ నేత. జీవన్‌రెడ్డిని కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను వదలుకోదలచుకోలేదు. పార్టీ వీడే అంశంలో పునరాలోచన చేయాలని కోరాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. 'జీవన్ రెడ్డి మా తండ్రి సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అనే ఆశతో ఇక్కడి నుంచి వెళ్తున్నామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు.అయితే వారు ఎలాంటి హామీ ఇవ్వలేక పోయారు. దీంతో ఆయనకు సూచనలు చేసి వెనుదిరిగారు. పార్టీ మారడామా లేదా అన్నది కూడా తన చేతిలో లేదని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటికే శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లు ఓమారు జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఇక ఈ భేటీ అనంతరం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ చర్చలు ఫలించలేదు. జీవన్‌రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీని అభిమానులు తొలగించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది పరిష్కారం లేని సమస్యగా మారింది.. సమస్యకు పరిష్కారం నా దగ్గర లేదు.. వారి దగ్గర కూడా లేదు. రేపు 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ అవ్వండి. గార్డెన్‌కి రండి.. రేపు భవిష్యత్తు, పయనం ఎలా ఉంటుందో తెలియదు.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం నేను చేయలేను. నేను నా నిర్ణయం రేపు ప్రకటించబోతున్న.. నా నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నా.' అని జీవన్‌రెడ్డి తెలిపారు. ఇక కాంగ్రెస్‌కు రేపు జీవన్‌రెడ్డి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

# బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బిఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి

ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, తమ ఆలోచనలన్నీ ప్రజల అవసరాల చుట్టూనే తిరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని భట్టి తెలిపారు. ఏదైనా కారణంతో ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకూడదన్న ఉద్దేశంతో రూ. 1.20 కోట్ల ప్రమాద భీమా కల్పించామని, దీనివల్ల 7.50 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. గతంలో ఉద్యోగులను హౌస్ అరెస్టులు చేసి, భయం భయంగా బతికించిన బీఆర్ఎస్ నేతలకు ఈ సంక్షేమం ఇష్టం లేకే సభను వీడారని విమర్శించారు. పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో బడికి రావద్దన్న ఆలోచనతో పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టామని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ అందించాలని నిర్ణయించామన్నారు. అంతేకాకుండా, ఇంటర్ విద్యార్థులకు కూడా మొట్టమొదటిసారి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయబోతున్నామని, ఈ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షం బ్జడెట్ కాగితాలు చించి చెవిలో పెట్టుకుని వెళ్ళిపోయారని ఎద్దేవా చేశారు. వ్యవసాయాన్ని పండుగ చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని చెబుతూ, ఉచిత విద్యుత్ అనేది కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు రూ. 14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని, గత ప్రభుత్వంలాగా ఓట్ల కోసం ఔటర్ రింగ్ రోడ్డును కుదువబెట్టి డబ్బులు పంచే సంస్కృతి తమది కాదని హితవు పలికారు. సన్నధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకుంటామని భరోసా ఇచ్చారు. మత, ప్రాంత భేదం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల ప్రమాద భీమా కల్పించామని, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, ఆర్టీసీ ఉచిత ప్రయాణం వంటి పథకాల కోసం రూ. 50 వేల కోట్లు కేటాయించామని భట్టి విక్రమార్క వివరించారు. వ్యక్తులుగా తాము చిన్నవాళ్ళం కావచ్చు కానీ, తాము చేపట్టిన ప్రజాస్వామ్య ప్రక్రియను మన్నించి చర్చలో పాల్గొనాల్సింది పోయి, 'ఆడలేక మధ్యలో ఓడు' అన్నట్టుగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఆయన ప్రసంగాన్ని ముగించారు.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు ఫోన్ చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులు, హోర్ముజ్ జలసంధి తెరిపించాల్సిన అవసరంపై ఇరువురు నేతలు చర్చించారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడే ప్రధాని మోదీతో మాట్లాడారు. హోర్ముజ్ జలసంధిని తెరిపించాల్సిన అవసరంతో పాటు పశ్చిమాసియాలో పరిస్థితిపై ఉభయులూ చర్చించారు' అని సెర్గియో గోర్ ఆ ప్రకటనలో తెలిపారు. రాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఐదు రోజులపాటు దాడులు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ సోమవారంనాడు సంచలన ప్రకటన చేశారు. రెండ్రోజులుగా ఇరాన్‌తో జరుపుతున్న చర్చలు ఫలప్రదంగా సాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అయితే అమెరికాతో చర్చలను ఇరాన్ కొట్టివేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోనులో సంభాషించినట్టు ప్రధానమంత్రి మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై తమ మధ్య ఉపయోగకరమైన చర్చ జరిగిందన్నారు. వీలైనంత త్వరలో ఉద్రికతలు తొలగేందుకు, శాంతి పునరుద్ధరణకు భారత్ మద్దతు ఉంటుందని తాను స్పష్టం చేసినట్టు పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి తెరవడం, రక్షణ కల్పించడం, అందరికీ అందుబాటులోకి తేవడం యావత్ ప్రపంచానికి అవసరమని పేర్కొన్నారు.

## ఇంటిమిట్టలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణమూర్తులను, ముఖ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీమన్నారాయణ, హనుమంతుడు, రంగ మండపంలో జయవిజయులు, గరుడాళ్వారు, బలిపీఠం, ధ్వజ స్తంభాన్ని, భక్త సంజీవరాయ స్వామి ఆలయాన్ని, పవిత్ర జలాలతో శుద్ధి చేశారు. రామయ్య క్షేత్రంలో పూజలు చేశారు. అనంతరం సుగంధ ద్రవ్యాల మిశ్రమాన్ని గోడలకు లేపనం చేశారు. రామయ్య దర్శనాన్ని ఉదయం 8.30 గంటల నుంచి ఆపేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 11.30 గంటలకు అనుమతి ఇస్తామని అధికారులు తెలిపారు. డిప్యూటీ ఈవో ప్రశాంతి, డీఈ నాగరాజు, ఆలయ పర్యవేక్షకుడు హనుమంతయ్య, తనిఖీ అధికారి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## లొంగిపోయిన మావోయిస్ట్ నేత పాపారావు

మావోయిస్టు అగ్రనేత పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య పోలీసుల ఎదుట లొంగిపోయాడు. 17 మంది అనుచరులతో బీజాపూర్ ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. లొంగిపోయిన వారిలో 10 మంది పురుషులు, 8 మంది మహిళలు ఉన్నారు. వారి నుంచి భారీగా ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ ప్రాంతానికి చెందిన పాపారావుపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. అతడిపై 50 కేసులు ఉన్నాయి. సుక్మా జిల్లా కలెక్టర్ అపహరణ ఉదంతంలో పాపారావు కీలక పాత్ర పోషించాడు. 76 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలోనూ ఇతడి హస్తం ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

## అమరావతిలో మరోమారు అగ్నిప్రమాదం

రాజధాని అమరావతిలో మరోసారి భారీ అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి రాయపూడి సమీపంలో ప్రిన్సిపల్ సెక్రటరీల భవనాల వద్ద నిర్మాణ ప్రాంగణంలో చోటు చేసుకుంది. కాంట్రాక్టు సంస్థ మేఘా కంపెనీకి చెందిన ప్లాస్టిక్ పైపుల వద్ద అకస్మాత్తుగా నిప్పులు చెలరేగాయి. దీంతో భారీగా మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలికి చేరుకుని సహాయక చర్యలను సమీక్షించారు.

## క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తం అవసరం

మొదటి పేజీ తరువాయి

అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. లేకుంటే ఒకరి నుంచి మరొకరికి ఇది వ్యాప్తి చెంది సమాజానికి సవాల్ చేయగలదన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో యువ పల్మనాలజిస్టులు చేపట్టిన చైతన్య కార్యక్రమాన్ని మంత్రి అభినందించారు. ప్రతి ఒక్కరూ ఇలా చైతన్యం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ క్రమంలో సామాజిక బాధ్యతగా గుర్తించిన యువ వైద్యులు ఓ బృందంప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, చైతన్యం చేయడానికి పూనుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలకు దిగారు. మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్యపార్క్‌లో నిర్వహించిన వాకథాన్‌తో పాటు మంగళవారం కెబిఆర్ పార్క్‌లో కూడా దీనిని నిర్వహించారు. న్యూ ఏజ్ పల్మనాలజిస్ట్స్ అసోసియేషన్ కోర్ కమిటీ నాపా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. అంకిత్ కోట్ల, డా. వివేక్ వర్ధన్ వీరపనేని,డా. బి. అనిరుధ్,డా. రోహిత్ రెడ్డి,డా. గోవర్ధన్ రెడ్డి, డా. కె. ప్రశాంత్ ,డా. ఉపేంద్ర, డా. ఓబుల్ రెడ్డిలు ఉన్నారు. వీరంతా కలసి ఈకార్యక్రమం ద్వారా ప్రజాచైతన్యం కోసం వాకథాన్ మంగళవారం కెబిఆర్ పార్క్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. విష్ణున్ రావు వీరపనేని, డా. సుధాకర్ కంది,డా. టిఎల్ఎన్ స్వామి,డా. దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలతో 1.04 కోట్ల కొత్త కేసులు నమోదైనవి అని నివేదించిందని అన్నారు. అవగాహనను పెంచడానికి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని 1982 నుండి ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకుంటున్నామని అన్నారు. తమ బాధ్యతగా నాపా ప్రతినిధులంతా కలసి ప్రజలను చైతన్యం చేసేందుకు ముందుకు వచ్చామని నాపా ప్రతినిధి డాక్టర్ వివేక వర్ధన్ వీరపనేని అన్నారు. ప్రజలు అప్రమత్తం కావలని, సకాలంలో వైద్యుల సలహాలు తీసుకుని, చికిత్సకు సిద్ధం కావాలని వీరంతా సూచించారు.

## ఢిల్లీ అసెంబ్లీ స్పకర్‌కు బెదిరింపు మెయిల్

మొదటి పేజీ తరువాయి

ఈ బెదిరింపులపై తామేమీ భయపడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బ్జడెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.

## రీజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా రింకూ సింగ్

టీమిండియా పవర్ హిట్టర్, టీ20 ప్రపంచ కప్ 2026 విజేత రింకు సింగ్‌కు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి అరుదైన గౌరవం లభించింది. అతడిని రీజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా యోగి సర్కార్ నియమించింది. ఈ మేరకు మంగళవారం లఖ్‌నవూలోని లోక్ భవన్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నియామక పత్రాన్ని రింకుకు సీఎం యోగి ఆదిత్య నాథ్ అందజేశారు. పొట్టి ప్రపంచం కప్ సమయంలోనే రింకు తండ్రి మరణించిన సంగతి తెలిసిందే. అంతటి విషాదంలో ఉండి కూడా తండ్రి అంత్యక్రియలు ముగిసిన వెంటనే తిరిగి జట్టుతో చేరి తన అంకిత భావాన్ని చాటుకున్నాడు. రింకు టీ20 ప్రపంచ కప్ 2026లో మొత్తం 5 ఇన్నింగ్స్‌లో 24 పరుగులు మాత్రమే చేశాడు. ఈ అన్ని మ్యాచ్‌లలో అతడు ఆఖరిలో బ్యాటింగ్‌కు వచ్చాడు. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 4 బంతుల్లోనే 11 పరుగులు చేశాడు.ప్రపంచ కప్ 2026లో అతడి అంకితభావానికి గుర్తింపుగా యోగి ప్రభుత్వం ఈ ఉద్యోగంతో సత్కరించింది. రింకు సింగ్ పొందిన పోస్ట్ గ్రూప్-ఏ కిందికి వస్తుంది. జీతం, అలవెన్సులతో కలిపి రూ. 70,000 వరకు చేతికి అందుతుంది. ఇక రింకు సింగ్‌తో పాటు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన మరో ఐదుగురు అథ్లెట్లకు కూడా యూపీ ప్రభుత్వం ఉద్యోగాలను ప్రకటించింది. రాజ్‌కుమార్ పాల్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (పారా హైజంప్), అజిత్ సింగ్, సిమ్రాన్‌లను కూడా గ్రూప్-1లో వివిధ పోస్టుల్లో యూపీ ప్రభుత్వం నియమించింది. 2024-25 సంవత్సరానికి గాను తొమ్మిది మంది క్రీడాకారులకు రాష్ట్ర అత్యున్నత పురస్కారాలైన లక్ష్మణ్ అవార్డు, రాణి లక్ష్మీబాయి అవార్డులను అందజేశారు. వీరికి రూ. 3.11 లక్షల నగదు బహుమతితో పాటు కాంస్య విగ్రహాన్ని బహూకరించారు.

# తెలంగాణ ఉద్యమకారులపై అక్రమ అరెస్టులు

## కాంగ్రెస్ హామీలు వెంటనే అమలు చేయాలి: కొమ్ము నరేష్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 24**

జమ్మికుంట పట్టణం: తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయకపోవడమే కాకుండా, వారి హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఉద్యమకారులపై అక్రమ అరెస్టులు చేయడం తీవ్రంగా ఖండనీయమని బీఆర్ఎస్వీ టౌన్ అధ్యక్షుడు కొమ్ము నరేష్ పేర్కొన్నారు.

ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటి స్థలం, 25 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ






హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడి చేపట్టేందుకు సిద్ధమైన నేపథ్యంలో నిన్న రాత్రి పోలీసులు పలువురు ఉద్యమకారులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఈ చర్యలు ఉద్యమ స్ఫూర్తిని అణిచివేయలేవని, గతంలో తెలంగాణ సాధన కోసం ప్రజలు చావో రేవో అంటూ పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారని తెలిపారు.

"ఈ రోజు మీరు ముఖ్యమంత్రిగా ఉన్నారు అంటే అది ఉద్యమకారుల త్యాగాల ఫలితమే. ఆ రోజుల్లో వందలాది కేసులు ఎదుర్కొంటూ ప్రజలు పువ్వెత్తున లేచి పోరాడారు. ఇప్పుడు అదే ఉద్యమకారులపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం తగదు" అని నరేష్ హెచ్చరించారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ఉద్యమకారుల ఆధ్వర్యంలో మరొక భారీ ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేసే ప్రభుత్వాలను ప్రజలు సహించరని, అవసరమైతే గద్ద దింపే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు, పార్టీ నాయకులు పాల్గొని ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.

# మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా హనుమన్న గారి నరేందర్ రెడ్డి ఎన్నికతో హర్షం వ్యక్తం చేసిన చిన్న చింతకుంట గ్రామ సర్పంచ్ సరితమహేష్ గౌడ్

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మార్చ్ 24**

మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా వెల్దుర్తి మండలం మానేపల్లి గ్రామానికి చెందిన హనుమన్న గారి నరేందర్ రెడ్డి ఎన్నుకోవడంతో హర్షం వ్యక్తం చేసిన చిన్న చింతకుంట గ్రామ సర్పంచ్ సరిత మహేష్ గౌడ్ ఈ సందర్భంగా జాతీయ భూమి నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ పొన్నం ఆంజనేయ గౌడ్ తో చరవాణి ద్వారా మాట్లాడుతూ మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా హనుమన్న గారి నరేందర్ రెడ్డిని ఎన్నుకోవడం ఎంతో ఆనందదాయకమని తాను రానున్న రోజుల్లో రాజకీయ పరంగా ముందుకు వెళ్లాలని సకల దేవతలను కోరుకుంటున్నామని వారు తెలిపారు తెలంగాణ రాష్ట్రాన్ని ఉపాధి సంవత్సరాలు పరిపాలించిన గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఎంతో అభివృద్ధి చెందుతుంది అని తెలంగాణ రాష్ట్ర ప్రజలు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని ఉద్దేశంతోనే ఓట్లు వేసి మరి గెలిపించుకున్న ఘనత తెలంగాణ రాష్ట్ర ఓటర్లు అని అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చినటువంటి వాగ్దానాలను నెరవేర్చే దిశలోనే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు తమ చేస్తున్న పరిపాలనను చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేయడం ఏ తప్పు ప్రతిపక్ష నాయకులు గత పరిపాలనలో మీరు చేసినటువంటి పరిపాలన సరిగ్గా ఉంటే మళ్లీ మూడోసారి జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ఓటు వేసి గెలిపించుకునే వారే మీ





ప్రభుత్వానికి స్వస్తి చెప్పారు అంటే గత పది సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రాన్ని ఇలా పరిపాలించారు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలుసునని అందుకే మూడోసారి జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ కి తగిన గుణపాఠం చెప్పారని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినా తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పరిపాలన చేస్తే తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రజానీకం ఎంతో బాగుపడుతుందని ఉద్దేశంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రజలు గత ప్రభుత్వానికి తగిన గుణపాఠమే చెప్పడమే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో బి ఆర్ ఎస్ అనే పార్టీ లేకుండా పోవడం ఖాయమని ప్రస్తుతం కాంగ్రెస్ పరిపాలనలను చేస్తున్నటువంటి అభివృద్ధి పనులను అడ్డుకోకుండా తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నటువంటి గ్రామాల అభివృద్ధి కోసం ప్రతిపక్ష పార్టీ నాయకులు కూడా సహకరిస్తే గ్రామాలను ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చుని గ్రామాల అభివృద్ధి కోసం ప్రస్తుత సర్పంచులు ఎంతో కృషి చేస్తున్నామని మేము చేస్తున్నటువంటి పనుల బిల్లులో వచ్చిన రాకుండా తమ సొంత ఖర్చులతో కూడా తమ గ్రామాలను అభివృద్ధి చేసే దిశలోనే ఉంటామని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తో రాజకీయ నాయకులకు కూడా ఒక విలువలు ఇవ్వకుండా చిన్న పెద్ద నాయకులు కార్యకర్తలు స్వార్థపర రాజకీయం చేసుకుంటూ సొంత పార్టీ నాయకులే వ్యతిరేకంగా రాజకీయం చేయడంతో కూడా కాంగ్రెస్ పార్టీ పరువు ప్రతిష్టలను తీసుకునే పరిస్థితులు ఏర్పడుతున్న తరుణంలో మన పార్టీ నాయకులు కార్యకర్తలు ఏకం అయి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చెందే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో ఎన్నో అభివృద్ధి పనులను చేసుకోవాలని పత్రిక ముఖంగా తెలియజేస్తున్నామని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజు రెడ్డి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుహాసిన్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు హనుమన్న గారి నరేందర్ రెడ్డి ఆశీస్సులతో చిన్న చింతకుంట గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లే ప్రయత్నం చేయడం జరుగుతుందని మన గ్రామాన్ని అభివృద్ధి చెందాలి అంటే గ్రామ ప్రజలు అందరి సహకారం ఉండాలని ప్రతిపక్ష నాయకుల మాటలు వింటే మన గ్రామాన్ని ఎలాంటి అభివృద్ధి దిశలోకి తీసుకువెళ్లక పోతామని గ్రామ ప్రజల సహకారమే తనకు ఎల్లవేళలా ఎంతో అవసరం అని వారు తెలియజేశారు

# ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహణ

**జమ్మికుంట, మార్చి 24 కరపత్రం ప్రతినిధి**

ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని జమ్మికుంట మున్సిపల్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులతో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వైద్యాధికారి డాక్టర్ వరుణ నాయకత్వం వహించారు.

"టి బి అంతం -- మన అందరి పంతం", "టి బి రహిత సమాజాన్ని నిర్మిద్దాం", "టి బి పరీక్షలు ఉచితం -- చికిత్స ఉచితం" వంటి నినాదాలతో విద్యార్థులు పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు.



ర్యాలీ అనంతరం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ వరుణ, హెల్త్ ఎడ్యుకేటర్ అడిదెల మోహన్ రెడ్డి విద్యార్థులకు టి బి వ్యాధి లక్షణాలు మరియు జాగ్రత్తలపై వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పడటం, దగ్గులో రక్తం రావడం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించడంతో పాటు వడదెబ్బ లక్షణాలు మరియు నివారణ చర్యలపై కూడా అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే మానవహారం ఏర్పాటు చేసి, టి బి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ వరుణ, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యేసు మని, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎం రాధ, టిబి క్లస్టర్ కోఆర్డినేటర్ తిరుపతి, ఆశా కార్యకర్త సునీత, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వల్భాపూర్‌లో ఆదిపత్య పోరు... ప్రజలకు ఇబ్బందులు, అభివృద్ధి నిలిచిపోతోందా?

**వీణవంక, మార్చి 24 కరపత్రం ప్రతినిధి**

వీణవంక మండలం వల్భాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఆదిపత్య పోరు కారణంగా సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో రెండు వర్గాల మధ్య రోజురోజుకూ విభేదాలు పెరుగుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా నిలిచిపోతున్నాయి. గ్రామంలో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు, కరెంట్ మీటర్లు పొందదలచిన వారు, అలాగే కొత్త నీటి



కనెక్షన్లు తీసుకునే వారు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒక వర్గం అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తే, మరో వర్గం అడ్డంకులు సృష్టించడం వల్ల పనులు పూర్తిగా ఆగిపోతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై బీజేపీ సీనియర్ నాయకులు ఎట్టెపు మహేష్ స్పందిస్తూ, గ్రామంలో జరుగుతున్న వర్గపోరు ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నదని అన్నారు. అభివృద్ధి పనులు రాజకీయ విభేదాల బలవంతంగా నిలిచిపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఇలా కొనసాగితే గ్రామ అభివృద్ధి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించిన ఆయన, సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. గ్రామంలో శాంతి వాతావరణం నెలకొల్పి, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలు కూడా తక్షణమే ఈ సమస్య పరిష్కారం కావాలని, శాంతి భద్రతలు కాపాడాలని కోరుతున్నారు.

# ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్‌ను ఆహ్వానించిన దేవస్థానం చైర్మన్ ఇంగ్లే రామారావు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 24**

అపర భద్రాద్రిగా ఖ్యాతి గాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో నిర్వహించబడనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్‌ను దేవస్థానం చైర్మన్ ఇంగ్లే రామారావు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను జ్ఞాపికతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మూడేత్తుల మల్లేష్ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు జమ్మికుంట మున్సిపాలిటీ తరఫున అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా పరిశుభ్రత, త్రాగునీటి సదుపాయం, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోటు ఉండకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవే లక్ష్యంగా తమ పాలకవర్గం పనిచేస్తుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపడతామని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశముండటంతో అన్ని శాఖల సమన్వయంతో సేవలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# త్వరలో 176 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం ప్రారంభం



**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), మార్చి 24:**

ఎన్టిపిసి జలాశయం వద్ద నిర్మిస్తున్న 176 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం పనులు పూర్తి కాగా త్వరలో ఉత్పత్తి దశలోకి తీసుకురానున్నామని ఎన్టిపిసి ఈడి చందన్ కుమార్ సమంత తెలిపారు. ఎన్టిపిసి టీటీఎస్ ఉద్యోగ వికాస కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జలాశయంపై 56 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం నిర్మాణం పనులు పూర్తయ్యాయని, దానికి సమీపంలో 120 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం పనులు కూడా పూర్తయ్యాయని వివరించారు. గ్రిడ్ క్లియరెన్స్ రాగానే ఉత్పత్తి దశలోకి తీసుకురానున్నామని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం రామగుండం ఎన్టీపిసిలో 86.3 శాతం పిఎల్ఎఫ్ తో ఉత్పత్తి చేపట్టామని, అదేవిధంగా తెలంగాణ విద్యుత్ పరిశ్రమలో 91.4 శాతం పిఎల్ఎఫ్ తో విద్యుత్ ఉత్పత్తి చేపట్టినట్లు వివరించారు. గోదావరిఖని ఎస్సీ బాలికల వసతి గృహ నిర్మాణానికి సిఎస్ఆర్ కింద రూ. 2.14 కోట్లు కేటాయించగా.. పనులు పూర్తయ్యాయని తెలిపారు. విలేకరుల సమావేశంలో హెచ్ఓహెచ్ఆర్ బిజయ్ కుమార్ సిగ్దర్, జిఎంలు ముకుల్ రాయ్, మనీష్ అగర్వాల్, బినోద్ అగర్వాల్, అభిజిత్ దత్తా, తెలంగాణ ప్రాజెక్టు హెచ్ఓడి డీఎస్.రావత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

## - శాలువాతో సన్మానించిన గ్రామస్తులు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన వికృర్తి లక్ష్మీనారాయణకు తెలంగాణ సాహితీ కళా సేవా సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో "ఉత్తమ ఉపాధ్యాయ ఉగాది పురస్కారం" లభించగా మంగళవారం గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, యువకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన విద్యా సేవలను ప్రశంసిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి చేసిన కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ మాజీ డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, మాజీ ఉప సర్పంచ్ నల్ల సతీష్ రెడ్డి, గుడిసె అనిల్ కుమార్,వికుర్తి సాయి బాబు,అన్నాడీ జనార్దన్ రెడ్డి, గుడిసె పురుషోత్తం, దాసు,గుడిసె తిరుపతి, వాసు, అనిల్ రెడ్డి, అన్నడి సతీష్ రెడ్డి, రెడ్డి విజయ్ రెడ్డి,గుడిసె నరేష్, మిట్టపల్లి రాజిరెడ్డి,చందనం నరేష్,తదితరులు పాల్గొన్నారు

కరపత్రం తెలుగు దిన పత్రిక
బుధవారం మార్చి 25, 2026

# క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం

**కరపత్రం ప్రతినిధి మంథని మార్చి 24**



మంథని మండలంలోని ఏక్లాస్పూర్ లో మంగళవారం పల్లె దావఖాన వైద్య సిబ్బంది ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం పై అవగాహన కల్పించారు వైద్య సిబ్బంది ఎం ఎల్ హెచ్ పి జ్యోతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 24ను ప్రపంచ క్షయ దినోత్సవంగా జరుపుకుంటారు "టిబి" అనేది ఒక సంక్రమణ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది.లి రెండు వారాలకు పైగా దగ్గు,రక్తంతో దగ్గు, జ్వరం,బరువుతగ్గడం,రాత్రి చెమటలు, ముఖ్య లక్షణాలు. దగ్గేటప్పుడు నోరు మూసుకోవాలి.లి శుభ్రమైన గాలి ఉండేలా చూసుకోవాలి. లిపోషకాహారం తీసుకోవాలి. "టిబి" "అనేది పూర్తిగా నయమవుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స లభిస్తుంది. మందులు పూర్తిగా తీసుకోవాలి మధ్యలో ఆపకండి అని వివరించారు మనమందరం కలిసి పని చేస్తే "టీబి"ను పూర్తిగా నిర్మూలించగలం. ఈ కార్యక్రమంలో పల్లె దావఖాన వైద్య సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా ఎన్నికైన మంథని బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సన్మానం

**కరపత్రం ప్రతినిధి మంథని,మార్చి 24**



మంథని బార్ అసోసియేషన్ కు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా కెవిఎల్ఎన్ హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా ముస్కుల సయేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కేతిరెడ్డి రఘోత్తం రెడ్డి లు నూతనంగా ఎన్నిక కాగా మంగళవారం మంథని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కెవిఎల్ఎన్ హరిబాబు, ప్రధాన కార్యదర్శి ముస్కుల సయేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రఘోత్తం రెడ్డి లను కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ కలసి శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# ఇంటర్నేషనల్ అవార్డు అందుకుంటున్న లయన్ లేడీ సంపతి కుమారి

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మార్చి 24**




ఇంటర్నేషనల్లయన్స్ క్లబ్ 320+ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్ సిటీ క్లబ్ ద్వారా వివిధ రకాల సేవలు అందిస్తూ నూతన మహిళా క్లబ్ ఏర్పాటు చేయడం, మెంబర్షిప్ పెంచడం, అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రీజనల్ చైర్ పర్సన్ ఊకంటి సంపతి కుమారి కి లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఏపీ సింగ్ ఇంటర్నేషనల్ అవార్డు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ 320జి లయన్స్ క్లబ్ ల సమావేశం వసుధ కన్వెన్షన్ లో జరిగిన సందర్భంగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు ద్వారా అవార్డును అందుకోవడం జరిగింది.ఈ సందర్భంగా గవర్నర్ సింహరాజు కోదండరాం, ఫాస్ట్ గవర్నర్లు హనుమాన్ల రాజిరెడ్డి, విజయలక్ష్మి, ఆర్ వి రావు, ఉపగవర్నర్లు బద్రేశం, చంద్ర ప్రకాష్, సంపతి కుమారిని అభినందించారు

# ముందస్తు అరెస్ట్..

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 24**




జమ్మికుంట మండలం తెలంగాణ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వడ్డెరల ఆత్మ గౌరవ కోసం అసెంబ్లీ ముట్టడి కి వెళ్తున్న వడ్డెర సంఘం జమ్మికుంట మండల అధ్యక్షుడు పల్లపు రవి ని పోలీస్ లు ముందస్తు గా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎన్ని అక్రమ అరెస్ట్ లు చేసిన వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు అయ్యేవరకు మా పోరాటం ఆగదు అని అన్నారు.అలాగే వడ్డెర కులాన్ని ఎస్టిలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# భీమేశ్వర స్వామి సేవలో విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాసరావు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి శేషవస్త్రం కప్పి లడ్డూ ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నానో యూరియా వినియోగం -- పంటల సస్యరక్షణపై రైతులకు శిక్షణ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 24**

హుజురాబాద్: వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (బిటిటి) హుజురాబాద్ ఆధ్వర్యంలో మడిపల్లి రైతువేదికలో మడిపల్లి, అంకుసాపూర్ గ్రామాలకు చెందిన రైతులకు పంటల సాగులో నానో యూరియా వినియోగం, వరి మొక్కజొన్న పంటలలో సస్యరక్షణ చర్యలపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట శాస్త్రవేత్త విజయ్ మాట్లాడుతూ భూమి ఆరోగ్యం పంటల దిగుబడులకు ఎంతో కీలకమని తెలిపారు. ప్రధాన పంటకు ముందు పచ్చి ఎరువులైన జీలుగా, జనుము, పిల్లిపెసర వంటి పంటలను పొలంలో చల్లి పూత దశలోనే నేలలో కలిపితే భూమి సారం పెరుగుతుందని చెప్పారు. భూమిలో ఆర్గానిక్ కర్బనం ఉండటం వల్ల నేల శక్తి మెరుగుపడుతుందని వివరించారు. జమ్మికుంట కేవీకేలో ప్రకృతి పద్ధతుల్లో సాగు కొనసాగుతోందని, రైతులు అక్కడికి వెళ్లి ఆ విధానాలను నేర్చుకుని అమలు చేస్తే నేల ఆరోగ్యం మాత్రమే కాకుండా మనుషుల ఆరోగ్యం కూడా





మెరుగుపడుతుందని సూచించారు.

మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ పంటలను చీడపీడల నుండి రక్షించేందుకు సూడోమోనాస్‌ను పంట కాలంలో మూడు సార్లు పిచికారి చేయాలని సూచించారు. వేపనూనెను కలిపి పిచికారి చేస్తే పురుగుల గుడ్లు నశించడంతో పాటు తల్లి పురుగులు గుడ్లు పెట్టకుండా నిరోధించవచ్చని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలో అగ్గితెగులు ఎక్కువగా కనిపిస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు పాటించాలని సూచించారు.

యూరియాను అధిక మోతాదులో వాడటం వల్ల పంటలు రోగాలకు గురయ్యే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. నానో యూరియాలో యూరియా శాతం సుమారు 20% ఎక్కువగా ఉండటంతో పంటలకు సమర్థవంతంగా ఉపయోగపడుతుందని తెలిపారు. మొదటి రెండు దఫాల్లో సాధారణ యూరియా వాడిన తర్వాత, మూడో మరియు నాలుగో దఫాల్లో నానో యూరియాను స్ప్రే చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చని చెప్పారు. నానో యూరియాను ట్రైసైక్లజోల్, ఏమమెక్టిన్ బెంజోయేట్, సి.ఓ.సి మినహా ఇతర పురుగుమందులతో కలిపి వాడవచ్చని వివరించారు.

ఈ కార్యక్రమంలో మడిపల్లి సర్పంచ్ పసుల తిరుమల, అంకుసాపూర్ సర్పంచ్ కవిడే కుమారస్వామి, ఉప సర్పంచ్ కే.కొండల్ రెడ్డి, ఏఈఓ రాంప్రసాద్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానించిన ఇంగిలే రామారావు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 24**

కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలంలో ఈ నెల 27వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవానికి హాజరుకావాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం గారిని ఆలయ కమిటీ మర్యాదపూర్వకంగా ఆహ్వానించింది.

మంగళవారం రోజున ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు, ధర్మకర్తలు కలిసి స్వప్న సదానందం ను ప్రత్యక్షంగా కలుసుకుని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈ కళ్యాణ మహోత్సవాన్ని ఈసారి మరింత ఘనంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరపడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



అలాగే భక్తుల కోసం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, హరినామ సంకీర్తనలు, వేద పండితుల ఆశీర్వచనాలతో ఈ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ కృషి చేస్తోందన్నారు. మండలం నలుమూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు.

ఈ సందర్భంగా పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ, ఆలయ కమిటీ ఆహ్వానం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ, తప్పకుండా కళ్యాణ మహోత్సవానికి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందుతానని తెలిపారు. అలాగే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సత్సంకల్పాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే మహోత్సవం విజయవంతం కావాలని అందరూ ఆకాంక్షించారు.

# ఎస్ ఆర్ ఆర్ కామర్స్ విద్యార్థులకు పరిశోధన పద్ధతులు ప్రాజెక్టు రిపోర్ట్ తయారీపై ఒక రోజు కార్యశాల

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మార్చి 24**

నేటి సమాజం ఎదుర్కొంటున్న వివిధ సమస్యల తో పాటు వ్యాపార వాణిజ్య రంగాలలోని వివిధ సమస్యలకు పరిష్కార మార్గాలు కనుక్కోవడానికి పరిశోధనలే మూలమని శాతవాహన యూనివర్సిటీ కామర్స్ ,మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపల్, ఉపకులపతి ప్రత్యేక అధికారి డాక్టర్ డి హరికాంత్ పేర్కొన్నారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటనామస్ కళాశాల కామర్స్ విభాగం, ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ హైదరాబాద్ సౌజన్యంతో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో డాక్టర్ హరికాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపార వాణిజ్య రంగాల రంగాలలోని వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, అవి ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలను కనుగొనాలనే ఉద్దేశంతోనే ఈ పరిశోధన పద్ధతులు ప్రాజెక్టు రిపోర్టును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దీని ద్వారా విద్యార్థులు సమగ్ర విశ్లేషణ, పరిష్కార






మార్గాలతో పాటు భాష నైపుణ్యం పైన పట్టు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనాభిముఖ దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యశాలకు ప్రముఖ వ్యక్తులుగా ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ హైదరాబాద్ కు చెందిన ప్రొఫెసర్ వై. రామకృష్ణ మరియు సహాయ ఆచార్యులు. ఏ. రాకేష్ ఫణీంద్ర, పాల్గొని పరిశోధన అంశం ఎంపిక, పరిశోధన రూపకల్పన, డేటా సేకరణ, విశ్లేషణ , ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీపై కామర్స్ విద్యార్థులకు విస్తృతంగా వివరించారు.

కళాశాల వైస్ ప్రిన్సిపల్ , కామర్స్ విభాగాధిపతి రాజయ్య మాట్లాడుతూ ఈ కార్యశాల ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థులకు పరిశోధన పద్ధతులపై ప్రాథమిక అవగాహన కల్పించడంతో పాటు, వారు పరిశోధనా ప్రాజెక్టులను సమర్థవంతంగా చేపట్టేలా చేయడం. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాటక్, కామర్స్ విభాగాధిపతి టి. రాజయ్య, టీజీసిజిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, కార్యశాల సమన్వయకర్త డా. బుర్ర నరేష్, ఐక్యుఏసి సమన్వయకర్త డాక్టర్ హర్ జ్యోత్ కౌర్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు డా. ఎం. మల్లారెడ్డి, డా. ఆర్. రామకృష్ణ, డా. కె. అర్జున్, ఎం. శిరీష, టి. అరవింద్, బి. నర్మద, సిహెచ్ రాములు, ఏ మల్లేశం ఐలయ్య, రాజు, పూర్ణచందర్, గౌతమి, ప్రజ్ఞ, విద్యార్థులు పాల్గొన్నారు.

# మావోయిస్టు కీలక నేత లొంగుబాటు...

**జమ్మికుంట/ మార్చి 24 కరపత్రం ప్రతినిధి**

మావోయిస్టు పార్టీకి చెందిన దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ) సభ్యుడు, పశ్చిమ బస్తర్ డివిజన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్న పాపారావు పోలీసుల ముందు లొంగిపోవడం నక్సల్ ఉద్యమంలో కీలక పరిణామంగా మారింది. ఆయనతో పాటు సుమారు 12 నుండి 17 మంది మావోయిస్టు సభ్యులు కూడా లొంగుబాటుకు ముందుకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

దశాబ్దాలుగా మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించిన పాపారావు, దండకారణ్యం ప్రాంతంలో పలు కార్యకలాపాలకు నాయకత్వం వహించినట్టు భద్రతా వర్గాలు వెల్లడించాయి. పశ్చిమ బస్తర్ డివిజన్‌లో పార్టీ



కార్యకలాపాలను సమన్వయం చేయడంలో ఆయన పాత్ర కీలకమని సమాచారం.

పోలీసు వర్గాల ప్రకారం, ప్రభుత్వ లొంగుబాటు మరియు పునరావాస విధానాల ప్రభావంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అడవుల్లో కష్టసాధ్యమైన జీవనం, ఆరోగ్య సమస్యలు, కుటుంబ సభ్యుల నుంచి దూరంగా ఉండటం వంటి కారణాలు కూడా లొంగుబాటుకు దారితీసినట్లు అధికారులు పేర్కొన్నారు.

లొంగుబాటు అనంతరం పాపారావు మాట్లాడుతూ, హింసా మార్గం సమస్యలకు పరిష్కారం కాదని, ప్రధాన ప్రవాహంలోకి చేరి సాధారణ జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నానని తెలిపినట్లు సమాచారం. మిగిలిన మావోయిస్టు సభ్యులు కూడా ఈ మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చినట్లు తెలుస్తోంది.

ఈ లొంగుబాటు మావోయిస్టు కార్యకలాపాలపై ప్రభావం చూపే అవకాశముందని భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా దండకారణ్యం వంటి కీలక ప్రాంతాల్లో నాయకత్వ లోపం ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా, లొంగుబాటుకు ముందుకు వచ్చిన వారికి ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాలు, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని అధికారులు తెలిపారు. ఆయుధాలు వదిలి సామాజిక జీవనంలో చేరే వారికి అన్ని విధాలుగా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ ఘటన ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, భవిష్యత్తులో మరిన్ని లొంగుబాట్లు జరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.